

# టేకిట్ ఈజీ!!
## శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



నెలకో ఎపిసోడ్ రెడీ..జీ..

ఎవరేమన్నా..ఏదేమైనా టేకిట్ ఈజీ..!

## శాస్త్రోక్త విధానేన..

**మధ్యాహ్నం** "మద్రాస్ మహల్ సౌతిండియన్ కజిన్" గాడి దగ్గర తిన్న మాషచక్రాలు ఇంతింతై, మరింతై మూర్తి కడుపులోనే మూడుపాదాలూ పెట్టేస్తున్నాయి. "వెధవది, వాడికి పన్నెండు విచ్చుడాలర్లిస్తున్నావన్న బెంగలో, కడుపాశతో, కక్కుర్తిపడి రెండంటే రెండు గారెముక్కలు ఎక్కువ వేసుకున్నాను, ఇప్పుడు బలైపోతున్నాను, తినేవయసైపోయింది గావాల్ను" అనుకుంటూ కప్పని మింగిన పాములా మంచం మీద అటూ యిటూ దొర్లుతున్నాడు నిద్రపట్టక. వంటిల్లు సర్దేసి పైకొచ్చి పక్కన కూర్చుంది పూర్ణ "ఏవండీ" అంటూ.

శంకరాభరణం సినిమాలో చెప్పాడు కదా "ఆకలేసిన బిడ్డ అమ్మా అని ఒకలా అరుస్తాడు.." అంటూ. అల్లాగే పూర్ణ "ఏవండీ" సౌండుకి కూడా అనేక రూపాలున్నాయి. పిల్లనిలేపి స్కూలుకి తయారు చెయ్యమని వంటింట్లోంచి వచ్చే "ఏవండీ" ఒకలా వుంటుంది. తన వంటల్లో ఉప్పు తక్కువైన రోజు మూర్తి అభిప్రాయం అడిగే ఎంక్వయిరీ "ఏవండీ" మరోలా వుంటుంది. పెళ్ళిరోజు, పుట్టినరోజులూ, శ్రావణమాసాలప్పుడు ఘల్లుఘల్లుమనే "ఏవండీ" సౌండు చాలా ప్రియంగా వుంటుంది. వీటన్నిటినీ మించిన "ఏవండీ" ఒహటుంది. ఐదేళ్ళక్రితం ఆ "ఏవండీ"యే మూర్తిని ముగ్గులోకి దింపింది. ఇప్పుడు వాళ్ళమ్మాయికి నాలుగేళ్ళనుకోండి, అది వేరేవిషయం. ఇలా ప్రతీ "ఏవండీ" వెనకాతలా ఒక ఆర్ద్రత దాగివుండడం చేత ఇది ఏ "ఏవండీ" నా అని ఆలోచిస్తున్న మూర్తిని కుదుపుతూ

" రేపు శ్రీలత, గిరిబాబు గారింట్లో హౌస్ వార్మింగ్ లంచ్ ట. పొద్దున్నే వెళ్ళి ఏదైనా పెద్ద గిఫ్ట్ కొని పాక్ చేయించుకుని రండి, వాళ్ళకి చిన్న చిన్నవి ఆనవు" అంది పూర్ణ.

"వాళ్ళిల్లుకొని నాలుగేళ్ళయ్యింది. కొన్నప్పుడిచ్చారు కదా పార్టీ, మళ్ళీ ఇంకో హౌసువార్మింగేవిటీ నా బొంద.."

"ఇది బేస్మెంటు వార్మింగు, మొన్ననే ఫినిష్ చేయించుకున్నార్ట ఎనభైవేలు పెట్టి.."

"బాగా దూల తీరుంటుంది. ఎనభైవేలకి ఇండిపెండెంటు ఇళ్ళిచ్చేస్తున్నారు ఈ ఎకానమీలో"

"అదీ కొంటున్నార్ట.." అంది పూర్ణ వెక్కిరిస్తూ.

"సర్లే..ఇంతకీ మన బడ్జెట్ ఎంతా" అన్నాడు ఆవులిస్తూ.

"కనీసం వందైనా పెట్టాలి.." అంది పూర్ణ ఆలోచిస్తూ.

"ఎంకి పెళ్ళి సుబ్బి చావుకొచ్చిందనీ.., సర్లే తెల్లారాకాచూద్దాం" అంటూ ముసుగువీరుడైపోయాడు మూర్తి.

మర్నాడు యథావిధిగా మూర్తీ, పూర్ణా, పిల్లా, గిఫ్టూ అందరూ పన్నెండుమీదకి ముల్లొచ్చేసరికి గిరిబాబుగారింట హాజరయ్యారు. తలుపు తీసిన శ్రీలతని చూసి కంగారుపడింది పూర్ణ. వైడ్ స్క్రీన్ టీవీలో నవ్వుతూ నమస్తే పెడుతూ నించున్న నగల మోడల్‌లా వుంది శ్రీలత. ఆవిడ కుడిరెక్కకి ఒకళ్ళూ, ఎడంరెక్కకి ఒకళ్ళూ బోటుపెట్టి నడిపిస్తున్నారు, నగలబరువుకి పడిపోకుండా. "అన్నన్నా, ఒక్క త్రిశూలం కూడా ఇచ్చుంటే ఎంతబావుండేది !" అనుకున్నాడు మూర్తి.

"రండి, రండి" అంటూ వెనకనించి ఆహ్వానించాడు గిరిబాబు. ఏదో ఇంద్రజాల ప్రదర్శనకి సిద్ధమౌతున్న పీసీ సర్కార్‌లా వున్నాడాయన ఆడ్రెస్సులో. పిల్లలుకూడా అప్పుడే "మెహెందీ లగాకే రఖ్‌నా " పాటకి డాన్సు చేసొచ్చిన వాళ్ళలా వున్నారు. అందరూ కలిసి వీళ్ళని సోఫాలమీదికి ఆహ్వానించారు.

మరికాసేపట్లో ఇల్లు కిటకిటలాడిపోయింది.

"పదండి బేస్మెంటు చూద్దాం" అన్నాడు మూర్తి.

"ముందు మీరు కిచెన్‌లోంచి డెక్ మీదకెళ్ళండి. అక్కణ్ణించి కిందకి దిగి బేస్‌మెంట్‌లోకి ప్రవేశించండి" చెప్పాడు గిరిబాబు.

"అదేవిటీ, బేస్మెంటుకి చక్కగా లోపల్నించి మెట్లు పెట్టించుకుంటే బావుండేది కదండీ.." అన్నాడు మూర్తి అమాయకంగా.

"వున్నాయి, కానీ శాస్త్రప్రకారం బేస్ మెంట్ చూసేవాళ్ళు పశ్చిమద్వారంగుండా వెళ్ళాలిట.." అన్నాడు గిరిబాబు.

"పోనీ డెక్ మీదనించైనా మెట్లున్నాయా, లేకపోతే మిలిట్రీ వాళ్ళలాగ తాళ్ళమీంచి జారాలా.." అడిగాడు మూర్తి అనుమానంగా.

"మీరు మరీనూ, భలే జోకుతారు.." అంటూ డొక్కలో పొడిచాడు గిరిబాబు.

చేసేదిలేక అందరూ డెక్ మీంచే దిగారు. కిందో ఇంద్రభవనంలా వుంది. "నీకోసం వెలిసిందీ.." పాట గుర్తొచ్చి నవ్వొచ్చింది మూర్తికి. సినిమాహాలూ, పాప్‌కార్న బండీ, బారూ, కిచెనూ, బెడ్‌రూమూ, లైబ్రరీ, బాత్రూమూ సమస్తం వున్నాయక్కడ. కానీ అన్నీ అటోటీ, ఇటోటీలా వున్నాయి. కిచెన్ పక్కనే బాత్రూమూ, లైబ్రరీ పక్కనే సినిమాహాలూ ఇల్లాగ.

"లైబ్రరీ ఆదిక్కున వుంది. కానీ అక్కడ బరువుండకోడదు, అందుకని దాన్ని బేలన్సు చేస్తూ ఈమూల పూల్ టేబులు పెట్టాం. మరి లెక్కప్రకారం ఆ డైరెక్షనులో వంట చెయ్యాలి, అందుకని బాత్రూం ఆ పక్కనే వచ్చింది. రండి రండి, బాత్రూంలో ఈ ఎల్ షేపు టాయిలెట్ బౌల్ చూడండి. మనం ఆ పని చేస్తున్నప్పుడు మొహం అటుండాలి కానీ రెండోది ఇటుండకూడదట" ఆపాడు గిరిబాబు.

"మొహం అటుంటే..రెండోది ఇటుండక ఇంకెటుంటుందండీ? మరీ వేళాకోళం కాపోతే.." అన్నాడు మూర్తి సినిమాల్లో బ్రహ్మానందంలాగ.

"అందుకే...ఈ షేప్ బౌల్ కొన్నాం, దీనిలో మొహం అటుపెట్టుకుని, మిగితావి మనక్కావలసిన దిక్కులో తిప్పుకోవచ్చు. సరే, ఇక యీ ఫ్రిజ్జు చూడండి" అంటూ పేద్ద ఫ్రిజ్జు ముందు నిలబెట్టాడు.

"అందరూ చప్పట్లు కొట్టండి" అంది శ్రీలత ఉత్సాహంగా.

"పూర్తిగా చూసాకా కొడతామండీ" అన్నారు అతిథులు నీరసంగా.

"అబ్బ, అదికాదండీ, పోనీ, మూర్తిగారూ మీరు కొట్టండి ఓ మాటు" అడిగాడు గిరిబాబు.

కొట్టాడు మూర్తి.

వెంటనే ఫ్రిజ్జు తలుపు తెరుచుకుంది సంగీతం వినిపిస్తూ.

"మీకేంకావాలో అడగండి" అన్నాడు గిరిబాబు గర్వంగా.

"కందాబచ్చలి కూర" అన్నాడు మూర్తి మెల్లిగా ఫ్రిజిలోకి చూస్తూ.

"అబ్బా..అవికావు స్వామీ. బ్రెడ్డూ, జాముా, పచ్చి కూరలూ, ఫ్రిజ్జూ, పాలూ ఇలా ఏది అడిగితే ఆసొరుగు ముందుకొచ్చేస్తుందన్నమాట" అంటూ ఆ అతి అంతా ప్రదర్శించాడు గిరిబాబు.

చూసిచూసి కాళ్ళుపీకాయి అతిథులకి. ఈ సారి లోపల్నించే పైకెక్కమన్నాడు గిరిబాబు. ఎక్కుతుండగా ఓ పక్క ఒక భయంకరమైన తలకాయ బొమ్మ నాలిక బైటికిపెట్టి కనిపించింది, కెవ్వుమన్నాడు మూర్తి. వాడి కళ్ళు సూటిగా మూర్తినే చూస్తున్నాయి. "ఓహో, అదా, దిష్టితగలకుండా పెట్టాం. ఇంత పెద్దగా కట్టించుకున్నాం కదా, ఎవరైనా దిష్టికొడితే వాళ్ళకి రెండింతల నష్టం జరుగుతుందన్నమాట" అంది శ్రీలత తృప్తిగా. ఇంటికెళ్ళగానే తన రెండు ఫ్రిజ్జులూ సరిగ్గా పనిచేస్తున్నాయో లేదో చూసుకోవాలని నిర్ణయించుకున్నాడు మూర్తి. సరే ఎల్లాగైతేనేం, భోజనం చేసి బైటపడ్డారు మూర్తీ, పూర్ణా, పిల్లా.

కారెక్కిన పూర్ణ ఒకటే దిగులుగా వుంది.

"ఏవండీ, మనిల్లు అమ్మేదావండీ" అంది మెల్లిగా.

"దీన్నే అంటారు, రాజుని చూసిన కళ్ళతో మొగుణ్ణి చూస్తే మొత్తబుద్ధీ అని " అన్నాడు మూర్తి.

"అదికాదండీ, మనింట్లో అన్నీ తప్పులేట. ఇంటివెనకాతల అంత ఖాళీస్థలం వుండకూడదుట. ఎడంపక్క నీళ్ళవాగు వుండాలిట. వంటిల్లు ఇవతల మూల వుండాలిట, బాత్రూములో టాయిలెట్ బౌల్ ఆకారాలూ, స్థానాలూ మార్చెయ్యాలిట. దేవుడిగది అటకలో పెట్టాలిట. పైకెక్కడానికి సరిగ్గా పధ్ధెనిమిది మెట్లుండాలిట. మనకి పదమూడే వున్నాయి. ఇంటి పునాదుల్లో యంత్రం వెయ్యాలిట, లేకపోతే అరిష్టంట..శ్రీలత చెప్పింది" అంది పూర్ణ ఆందోళనగా.

"ఇంట్లో వున్నవాళ్ళు ముందుకి నడవచ్చునా లేక వెనక్కి నడవాలా? ఏవిటీ పిచ్చి ఛాదస్తాలు, ఒక్కొక్కళ్ళది ఒక్కొక్క వెర్రి" అన్నాడు మూర్తి.

"కాదండీ, శ్రీలత చెప్పిన మార్పులు చేయించుకుంటే ఇంట్లో అందరికీ జయం కలుగుతుందిట. ఇప్పటికి పన్నెండుమందికి అలాగే అయ్యిందిట."

"మనకిప్పుడొచ్చిన అపజయాలేవీ లేవుగానీ, నామాటవిని నువ్వివేవీ పట్టించుకోక, వీటిల్లో దిగావంటే ఆనక పీక్కోలేక, లాక్కోలేక ఛస్తాం. వున్నదున్నట్టుగా వుండనీ.." అన్నాడు మూర్తి.

"హైదరాబాదులో శ్రీలతావాళ్ళ పక్కింటివాళ్ళు ఇలాగే పట్టించుకోకపోతే, వాళ్ళింట్లో నలుగురు పోయార్ట" అంది పూర్ణ ప్రూఫ్ జతపరుస్తూ.

"మనం ముగ్గురవేగా.." అన్నాడు మూర్తి పరధ్యానంగా.

"ముగ్గురైతే పోయినా పరవాలేదా?" అంది పూర్ణ కోపంగా.

"అదికాదే పిల్లా. శాస్త్రవనేది మనిషిని చీకట్లోంచి వెలుగులోకి నడిపించేదిగా వుండాలేగానీ, మాటిమాటికీ మన అభివృధ్ధికి అడ్డంకిగా తయారవకూడదు. అయినా ఈ కాలంలో శాస్త్రం పూర్తిగా ఎవడికికి తెలిసి చచ్చును గనక. ఏదో ఎవడో రాసిందీ, ఎవడో కూసిందీ ఆధారంగా చేసుకుని వక్ర భాష్యాలు చెప్పేసారు బతకనేర్చిన వాళ్ళు. ఈ వెర్రి ముదిరినవాళ్ళూ, డబ్బు మూలుగుతున్న వాళ్ళూ తగుదునమ్మా అని ఏదో మొదలెట్టడం, మిగిలిన చెవలాయిలంతా గొర్రెలమందలా వాళ్ళని ఫాలో అయిపోవడం. మన ఇల్లు ఏదిక్కునుంది, మన ఫేస్ ఏ టర్నింగిచ్చుకుంది అన్నది కాదు కొచ్చెను, మన మనసు ఎంత నీటుగా వుంది, ఏ దిక్కూ లేనోడికి మనవల్ల ఏం ఉపకారం జరిగిందీ, అన్నదే పాయింటు" చెప్పడం ఆపాడు మూర్తి.

ఇంతలో ఇల్లొచ్చేసింది. ఎప్పటిలాగే సింహద్వారంలోంచి కాకుండా, గరాజ్‌లోంచే ఇంట్లో కెళ్ళిపోయారు మూర్తీ అండ్ ఫామిలీ.!!